క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



జెడ్పీ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

మద్దిపాడు: జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, తదితర నాయకులు సోమవారం ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్ విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న రామకృష్ణ

చీమకుర్తి: ఓ ప్రైవేటు జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న రాతి కింది చరణ్‌కు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కడవ రామకృష్ణ రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. సోమవారం చీమకుర్తిలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంటర్ విద్యార్థి కాలేజీ ఫీజు చెల్లించేందుకు ఆర్థికసాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు సుధాకర్, వీరారెడ్డి పాల్గొన్నారు.

సేవకు ప్రతి రూపం.. మదర్ థెరిసా



కార్యక్రమంలో మాట్లాడుతున్న పాస్టర్

ఒంగోలు టౌన్: సేవకు ప్రతి రూపం.. మదర్ థెరిసా అని, ఆమె ఎనలేని సేవలు చేశారని కవి, రచయిత జాలాది మోహన్ కొనియాడారు. మాజీ కౌన్సిలర్ సుద్దపల్లి శశిబాబు ఆధ్వర్యంలో సోమవారం మదర్ థెరిసా 114వ జయంతి నిర్వహించారు. ప్రకాశం భవనం వద్ద గల మదర్ థెరిసా విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాలాది ప్రసంగిస్తూ కుష్టు రోగులకు, నిరుపేదలకు ఆమె అనేక సేవలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు డీఎస్ పాల్, అల్ఫోన్స్, ప్రభుదాస్, రాజశేఖర్, దేవమణి, లిల్లిపుష్ప, విగ్రహ కమిటీ సభ్యులు కోచూరి రామూర్తి, ఏసుదాసు, జీఎంబీ కోటి, పాలడుగు రమేష్, ప్రేమల సుబ్బారావు, రాయపాటి సుబ్బారావు, అడ్వకేట్ సలగల జగజ్జీవన్, ఆదిమూలం సుబ్బారావు, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

బేస్తవారిపేట: స్థానిక బస్టాండ్ ఆవరణలో జాతీయ రహదారిపై స్కూటీ అదుపుతప్పి బోల్తా పడటంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. బేస్తవారిపేటలోని రాణిపేటకు చెందిన షేక్ సుభానీ స్కూటీపై కంభం నుంచి బేస్తవారిపేటకు వెళ్తున్న సమయంలో అదుపుతప్పి కిందపడ్డాడు. సర్వీస్ రోడ్డుకు వేసిన ఇనుప గ్రిల్‌కు సుభానీ తల తగటడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు 108లో తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు.



డాక్టర్ల ప్రాణాలకే రక్షణ లేకపోతే ఎలా..?

కోల్‌కతా ఘటన తర్వాత కూడా రాష్ట్రంలో, దేశంలో కొనసాగుతున్న లైంగిక దాడులను చూస్తుంటే భయం వేస్తోంది. వైద్యుల మీద దాడులు చేయడం అనేది ఊహించలేనిది. ఏమీ కాదనే లెక్కలేనితనంతోనే వైద్యుల మీద దాడులకు తెగబడుతున్నట్లు తెలుస్తోంది. వైద్యుల మీద దాడులు చేస్తే కఠినంగా శిక్షిస్తారనే భయం ఉంటే ఇంతగా బరితెగించరు. ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేయాలి. ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా చట్టాలను కఠినంగా అమలు చేయాలి. ప్రాణాలు కాపాడేవారి ప్రాణాలకే రక్షణ లేకపోతే ఎలా.? ఒకసారి ప్రతిఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ పాలపర్తి అభిజ్ఞ, మెడికల్ ఆఫీసర్, వెంకటేశ్వరకాలనీ యూపీహెచ్‌సీ, ఒంగోలు





ప్రశాంతంగా ఉంటేనే వైద్యం చేయగలం

వైద్యుని మానసిక పరిస్థితి ప్రశాంతంగా ఉంటేనే మంచి వైద్య సేవలు అందించగలుగుతారు. పలు రకాల భయాందోళనల మధ్య వైద్యులు ఉంటే వైద్యం కూడా అలానే ఉంటుంది. వైద్యులపై దాడులు చేసే వారిని, భయపెట్టేలా మాట్లాడే వారిపై కఠినంగా వ్యవహరించాలి. ప్రధానంగా రాత్రి వేళల్లో విధుల్లో ఉండే వైద్యులకు మరింత రక్షణ అవసరం. వైద్యుల రక్షణ కోసం ప్రభుత్వాలు మరిన్ని చర్యలు తీసుకుంటాయని ఆశిస్తున్నాం.

– డాక్టర్ రఫీ, పాదిలి సీహెచ్‌సీ

గోపాల గోపాల





ఒంగోలులోని ఐశ్వర్యనగర్ కృష్ణ మందిరంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు, దర్శించుకుంటున్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- బారులుదీరిన భక్తులు
- చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించిన చిన్నారులు
- పలు ప్రాంతాల్లో ఉత్సాహంగా ఉట్టి కొట్టే ఉత్సవాలు

ఒంగోలు మెట్రో:

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కృష్ణ నామ స్మరణతో సోమవారం ఒంగోలు నగరం పులకించింది. వాడవాడలా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. వివిధ పాఠశాలల్లో గోపిక, కృష్ణుల పోటీలు జరిగాయి. నగరంలోని ప్రధాన దేవస్థానాలలో కృష్ణునికి అభిషేకం, అర్చన, నైవేద్యాలు, ప్రసాదాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. స్థానిక మంగమూరు రోడ్డులోని ఐశ్వర్యనగర్, భగవాన్ మురళీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణునికి విశేషణ అలంకరణ జరిగింది. గోపాలనగరం శ్రీకృష్ణ మందిరం వద్ద ఉదయం నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులుదీరారు. రాత్రి ఉట్టి కొట్టే మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జయరాం థియేటర్ సమీపంలోని బాపూజీ గోసంరక్షణ సంఘంలో గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణుని మూలవిరాట్‌కు పంచామృతాల అభిషేకం చేశారు. శ్రీకృష్ణుని మందిరంలో భక్తులు భజనలు చేశారు. మధుర పదార్థాలు నైవేద్యాలుగా పంచిపెట్టారు. ఇందిరానగర్ ఇస్కాన్ మందిరంలో సంప్రదాయానుసారం నృత్య గీతాలతో నివేదనలు సమర్పించారు. భక్తులు ఆనందతన్మయత్వంతో పాటలు పాడుతూ నర్తించారు. మంగమూరు రోడ్డు మర్రిచెట్లకాలనీ సమీపంలోని రాధాకృష్ణ మందిరంలో గోపిక, కృష్ణుని వేషధారణలు, గులాబీ పూల అర్చనలు, తీపి పదార్థాలతో నైవేద్యాల సమర్పణ కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. స్థానిక అంకమ్మపాలెం కృష్ణ మందిరం వద్ద రాధాకృష్ణులకు విశేష అలంకరణలు జరిగాయి. వివిధ స్వచ్ఛంద, ధార్మిక సంస్థలు కృష్ణుని వేషధారణ పోటీలు నిర్వహించాయి. విశ్వహిందూ పరిషత్, ఇతర హిందూ సంఘాలు ఉత్సాహంగా పాలుపంచుకున్నాయి.



ఇస్కాన్ మందిరంలో పూజలందుకుంటున్న రాధాకృష్ణులు

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉప్పుగుండూరు గ్రామంలో శ్రీకృష్ణ యాదవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులను శ్రీకృష్ణుని వేషధారణలో అలంకరించి ఉట్టికొట్టే సనాతన ధర్మాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఒమ్మెవరం గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి గోకుల్ యూత్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: కృష్ణాష్టమిని కొత్తపట్నం మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కొత్తపట్నంలో కృష్ణాష్టమి విద్యార్థులను కృష్ణుడు, గోపికలుగా అలంకరించారు. కరస్పాండెంట్ ములకా రామిరెడ్డి కృష్ణుడు లీలల గురించి విద్యార్థులకు వివరించారు. ఈతముక్కల బస్టాండ్ సెంటర్‌లోని జ్వాలాముఖి ఆర్చి వద్ద ఉన్న కృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈతముక్కల కృష్ణుడి కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఒంగోలు జీజీహెచ్ బ్లడ్‌బ్యాంకు నుంచి వచ్చిన సిబ్బంది 26 మంది నుంచి రక్తం స్వీకరించారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను డాక్టర్ పి.ప్రసన్న అందజేశారు. సుమారు 750 మంది భక్తులకు అన్నదానం చేశారు. అల్లూరు, రాజుపాలెం, కొత్తపట్నం గ్రామాల్లో కృష్ణుడి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



ఒమ్మెవరం గ్రామంలో పూజలందుకుంటున్న గోపాలుడు



ఉప్పుగుండూరులోని కృష్ణాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



ఒంగోలులోని గోశాలలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



కుమారుడిని గోపాలకృష్ణుడిగా అలంకరిస్తున్న ముస్లిం మహిళ



కొత్తపట్నం : కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు



శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారి









కోటీస్ షాపింగ్‌మాల్ వారు నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



ఐశ్వర్యనగర్ మురళీకృష్ణ మందిరంలో పూజల్లో పాల్గొన్న మహిళలు



శ్రీకృష్ణ లీలలు ఆధ్యాత్మిక ఉపన్యాసంలో ప్రముఖ వాస్తు సిద్ధాంతి అగస్త్యరాజు శివ

ఈఎస్ఐ ద్వారా వైద్య సదుపాయం కల్పించాలి



గేట్ మీటింగ్‌లో ప్రసంగిస్తున్న మహేష్

ఒంగోలు టౌన్: ఒంగోలు నగర పాలక సంస్థలోని ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగాలలో పనిచేస్తున్న కార్మికులకు ఈఎస్ఐ ద్వారా వైద్య సదుపాయం కల్పించాలని పారిశుధ్య కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.మహేష్ డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థలో సుమారు వేయి మందికిపైగా పనిచేస్తున్నారని, వారందరికీ వెంటనే ఈఎస్ఐ కార్డులు అందజేయాలని కోరారు. సోమవారం 4వ డివిజన్ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ అరకొర జీతాలతో బతుకుబండి నెట్టుకొస్తున్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ప్రైవేటు వైద్యం పొందాలంటే వేల రూపాయలు ఖర్చుచేయాల్సి వస్తోందని చెప్పారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వలనే నేటి వరకు కార్మికులకు ఈఎస్ఐ కార్డులు రాలేదన్నారు. పది సంవత్సరాల నుంచి మృతి చెందిన, రిటైరైన, మధ్యలో ఆగిపోయిన కార్మికుల తాలూకు పీఎఫ్ క్లైమ్ డబ్బులు ఇప్పటి వరకు అందలేదని తెలిపారు. పీఎఫ్ రికార్డుల నిర్వాహణ లోపం కారణంగానే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కోవిడ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలివ్వాలని, రూ.21,000 రావాలని, కార్మికులను రెగ్యులర్ చేయాలని, పనిముట్లు, షేఫ్టీ పరికరాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.విజయ, కె.వెంకటేశ్వర్లు, యాకోబు, ఏలియా, దావీదు, ప్రభుదాస్ పాల్గొన్నారు.